# ఎయిర్‌బస్ డ్రైవర్లకు పెరిగిన జీతభత్యాలు

## ఏఐఎఫ్టియు (న్యూ) ఆధ్వర్యంలో యజమానులతో ఒప్పందం

**నర్సంపేట/మార్చి 3 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట పట్టణంలోని ఎయిర్‌బస్ డ్రైవర్లకు పెరిగిన జీతభత్యాలపై యజమానులుడ్రైవర్స్ యూనియన్ ప్రతినిధుల మధ్య మంగళవారం తుది ఒప్పందం కుదిరింది. గత వేతనాల ఒప్పందం డిసెంబర్ 2025తో ముగియడంతో నూతన ఒప్పందం కోసం డ్రైవర్ యూనియన్ నాయకులు యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు అందజేశారు. జనవరి 2026 నుంచి రెండు దఫాలుగా చర్చలు జరగగా, మంగళవారం నర్సంపేటలో జరిగిన తుది చర్చల్లో అగ్రిమెంట్‌పై సంతకాలు జరిగాయి.



ఒప్పందం ప్రకారం పల్లె వెలుగు డ్రైవర్‌కు 15 రోజులకు రూ.18,500, ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు 15 రోజులకు రూ.20,500 వేతనం చెల్లించనున్నారు. టెంపరరీ పల్లె వెలుగు డ్రైవర్‌కు రోజుకు రూ.1,250, ఎక్స్‌ప్రెస్ టెంపరరీ డ్రైవర్‌కు రోజుకు రూ.1,450 ఇవ్వనున్నారు. క్లీనర్‌కు 15 రోజులకు రూ.4,500 వేతనం నిర్ణయించారు. దసరా పండుగ సందర్భంగా ప్రతి డ్రైవర్‌కు రూ.2,000 బోనస్ చెల్లించాలని అంగీకరించారు. ఈ అగ్రిమెంట్ 01-01-2026 నుంచి 31-12-2028 వరకు అమల్లో ఉంటుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ప్రస్తుత వేతనాలపై 10 శాతం పెంపు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి నెల 10వ తేదీ లోపు డ్రైవర్లకు వేతనాలు చెల్లించాల్సిందిగా ఒప్పందంలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మోడం మల్లేశం మాట్లాడుతూ, తగిన వేతనాల సాధనలో ఐక్యంగా నిలబడి పోరాడిన డ్రైవర్లను అభినందించారు. కార్మికుల హక్కులు పోరాటాల ద్వారానే సాధ్యమవుతాయని, భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌బస్ డ్రైవర్ ఓనర్స్ యూనియన్ ప్రతినిధులు లక్కం ప్రభాకర్, నాగశెట్టి ప్రసాద్, దినేష్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే డ్రైవర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మోడం మల్లేశం, అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కందికొండ రాజు, ప్రధాన కార్యదర్శి కట్ల ప్రశాంత్, కోశాధికారి ఎరుకల రాజు, సోడ రంజిత్ కుమార్, రంజిత్, ప్రకాష్, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు హాజరయ్యారు.

## కొమరం భీం విగ్రహం వద్ద

# ఘనంగా హోలీ సంబరాలు



**నర్సంపేట/మార్చి 3 (జర్నలిస్ట్ వార్త):**నర్సంపేటలో ఆదివాసుల ఆరాధ్య దైవం కొమరం భీం విగ్రహం వద్ద ఆదివాసి ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారుఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షులు స్వర్ణపాక పాపారావు, ప్రధాన కార్యదర్శి ఈసం నరసింహారావు, పొనక విజయ్, ధనసరి నరసింహారావు, కల్తీ ఎల్లయ్య, చాట్ల నాగేశ్వరరావు, ధనసరి అంజయ్య, గొంది అశోక్, ఈసాల లక్ష్మయ్య, పెనక వీరస్వామి, పెనక రామస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ హోలీ పండుగ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ఆదివాసి సమాజంలో సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

# మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

## ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్






మహబూబ్‌నగర్,,**మార్చి 3 (జర్నలిస్ట్ వార్త)**
మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన భీమేశ్ (32) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మార్చురీలో కుక్కల శబ్దం రావడంతో దగ్గరికి వెళ్లి చూసిన బంధువులకు ఓ కుక్క మృతదేహాన్ని పీక్కుతినడం కనిపించింది. కుటుంబీకులు ఈ ఘటనను వీడియో తీసి, సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇంత ఘోరమైన పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు లేకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుసింది. దవాఖాన వైద్యులు, సిబ్బంది వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

# గుడి నిర్వహణలో కందిబండ శైలజ రాణి సేవలు ప్రశంసనీయం




**వైరా/మార్చి 3 (జర్నలిస్ట్ వార్త):**
వైరా మండలం కనకగిరి సిరిపురం గ్రామంలోని పురాతన వీరాంజనేయ స్వామి దేవాలయం భక్తుల నిత్య పూజలతో కళకళలాడుతోంది. ఈ దేవాలయాన్ని 1976 సంవత్సరంలో కీర్తిశేషులు కందిబండ రంగారావు, రాజ్యలక్ష్మి దంపతులు ప్రతిష్ఠించారు. 1976 నుండి 1987 వరకు రంగారావు స్వయంగా దేవాలయ నిర్వహణ బాధ్యతలు చేపట్టగా, 1987 నుండి 2019 వరకు ఆయన చిన్న కుమారుడు కందిబండ బాలమురళీకృష్ణ, వారి సతీమణి శైలజ కలిసి సేవలు అందించారు. 2019లో బాలమురళీకృష్ణ మరణించిన అనంతరం, అప్పటి నుండి వారి సతీమణి కందిబండ శైలజ రాణి తన కుమారుడు కందిబండ రాజేష్‌తో కలిసి దేవాలయ నిర్వహణను సమర్థవంతంగా కొనసాగిస్తున్నారు.



2026 ఫిబ్రవరి 24, 25, 26 తేదీలలో పురాతన దేవాలయంగా పేరొందిన వీరాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కందిబండ శైలజ రాణి, ఆమె కుమారుడు కందిబండ రాజేష్ మరియు కుటుంబ సభ్యులు కందిబండ రామారావు, కందిబండ నరసింహారావు, కందిబండ సంపత్ కుమార్, కందిబండ శ్రీధర్, కందిబండ శ్రీనివాస్‌ల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు విశేష సహకారం అందించారు. సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కందిబండ కుటుంబం తరఫున కందిబండ శైలజ రాణి మరియు కుటుంబ సభ్యులు, కొదమసింహం శ్రీమన్నాచార్యులు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏకాంతంలో అంతర్మథనం..

## ఆవేదనకాదు, ఆలోచన కావాలి.

మనుషుల మధ్య ఉంటూనే మనసు పంచుకోలేక, రద్దీగా ఉండే నగరాల్లోనూ అపరిచితుల్లా బ్రతుకుతున్న ఆధునిక మానవుడిని వేధిస్తున్న అతిపెద్ద సమస్య ఒంటరితనం సాంకేతికత పెరిగి లోకమంతా అరచేతిలోకి వచ్చినా ఆత్మీయ పలకరింపు కరువవుతున్న కాలమిది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల నీడలో ఊరట లభించేది; నేడు నాలుగు గోడల మధ్య స్మార్ట్‌ఫోన్ వెలుగులో మనిషి ఒంటరి దీవిలా మిగిలిపోతున్నాడు.

నిశ్శబ్దం వినిపించే కేక

ఒంటరితనం అంటే కేవలం చుట్టూ ఎవరూ లేకపోవడం మాత్రమే కాదు, ఉన్నవారితో అనుబంధం తెగిపోవడం కూడా. పని ఒత్తిడి, పోటీ ప్రపంచం మనిషిని యంత్రంలా మార్చేస్తున్నాయి. పగలు పరుగులతో గడిచినా, రాత్రివేళ పలకరించే ఏకాంతం అనేక ఆలోచనలకు వేదికవుతోంది. ఈ ఆలోచనలు ఒక్కోసారి సృజనాత్మకతకు దారితీస్తే, మరికొన్ని సార్లు విషాదంలోకి నెట్టేస్తున్నాయి. ప్రత్యేకించి యువతలో పెరుగుతున్న ఈ ఒంటరితనం, వారిని మానసిక ఆందోళనల వైపు నడిపిస్తోంది.

ఆలోచనల దిశ మారాలి

నిజానికి ఒంటరితనం అనేది ఒక శాపం కాదు, అదొక అవకాశం. లోకపు గోల వినపడని ఆ నిశ్శబ్దంలోనే మనిషి తనను తాను పరిచయం చేసుకునే వీలుంటుంది.

గడిచిన కాలంలో చేసిన తప్పులేమిటి? సాధించిన విజయాలేమిటి? అనే అంశాలపై దృష్టి సారించాలి.

సృజనాత్మకత: గొప్ప కవులు, శాస్త్రవేత్తలు తమ అత్యుత్తమ ఆవిష్కరణలు చేసింది ఏకాంతంలోనే.

డిజిటల్ విరామం: సామాజిక మాధ్యమాల్లో ఇతరుల కృత్రిమ సంతోషాలను చూస్తూ బాధపడటం మానేసి, మనసుకి నచ్చిన పనిని ఎంచుకోవాలి.

ఒంటరితనం వల్ల కలిగే ఆలోచనలు ప్రతికూలత వైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై, స్నేహితులపై ఉంది. మాట కలిపే మనిషి, కష్టం వినే మనసు తోడైతే ఎలాంటి ఒంటరితనమైనా ఇట్టే మాయమవుతుంది. ప్రభుత్వాలు కూడా మానసిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు చేరువ కావాలి.

ఏకాంతం అనేది మనల్ని మనం నిర్మించుకునే ప్రయోగశాల కావాలి తప్ప, కుంగిపోయే కారాగారం కాకూడదు. ఆలోచనలు నిర్మాణాత్మకంగా ఉన్నప్పుడు ఒంటరితనం ఒక బలంగా మారుతుంది. లోకంతో సంబంధం తెంచుకోవడం కాదు, లోకాన్ని గెలవడానికి మనతో మనం జరిపే యుద్ధమే 'ఏకాంత ఆలోచన' అవ్వాలి.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

# నాయకుని కుంట కబ్జా చేస్తున్నారంటూ ఆరోపణలు...?





## -కుంట కబ్జాను అడ్డుకున్న జిపిఓ...?

**బయ్యారం/మార్చి3(జర్నలిస్ట్ వార్త);**
మండలంలోని బయ్యారం రెవిన్యూ పరిధిలో వెంకట్రాంపురం గ్రామపంచాయతీలోని నాయకుని కుంట సుమారు 12 ఎకరాల భూమి గత కొన్ని సంవత్సరాలుగా కబ్జాకు గురవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మంగళవారం కుంటలో మట్టి పోసి డోజర్ల సహాయంతో పూడ్చివేత పనులు సాగుతుండగా గ్రామస్తులు దానిని అడ్డుకోబోయారు. దీనితో కుంట కబ్జా చేస్తున్న రైతుకు,గ్రామస్తులకు మధ్య వాగ్వివాదం చేసుకున్నట్లు సమాచారం. గ్రామస్తులు సంబంధిత రెవిన్యూ పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో,బయ్యారం గ్రామ జిపిఓ ప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకొని పనులను నిలిపివేసినట్లు తెలిసింది. కుంటకు సంబంధించిన రెవిన్యూ భూమిగా ఆధారాలు ఏమైనా ఉంటే తాహశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ పత్రాలను చూపించాలని రైతుకు సూచించారు. దీనితో కుంటలో పని చేస్తున్న డోజరు, ట్రాక్టర్ లు పనులు నిలిపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

నాయకుని కుంట కింద సుమారు 10 నుంచి 15 ఎకరాల వరకు రైతుల భూమి సాగు చేస్తున్నట్లు, కుంటకు రెండు తూములు కూడా ఉన్నాయని వాటిని సిమెంట్ తో పూడ్చివేశారని, గ్రామస్తులు నుండి ఆరోపణలు ఉన్నాయి. కుంటాపూర్చడం వల్ల కింది రైతులకు నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతాయని తమ పంట పొలాలకు నీటి సదుపాయం ఉండదని ఆరోపిస్తున్నారు. కుంట కబ్జాకు గురి కాకుండా పునరుద్ధరించాలని,లేనియెడల సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని శోక్లాతండ గ్రామస్తులు,నాయకులు తెలిపారు. దీనిపై తాహశీల్దార్ నాగరాజును వివరణ కోరగా నాయకుని కుంటకు సంబంధించిన వివరాలు రికార్డులలో పూర్తిగా పరిశీలించి,తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

# గ్రహణ వేళ మల్లికార్జునుడి సేవలో..

**ఐనవోలు/మార్చి3(జర్నలిస్ట్ వార్త):**
ఐనవోలు క్షేత్రం ఆ మల్లికార్జున స్వామి కొలువైన పుణ్యభూమి. ఆ రోజు ఆకాశంలో అద్భుతం జరగబోతోంది. చంద్రుడిని రాహువు కమ్మేసే చంద్రగ్రహణం సమయం దగ్గర పడుతోంది. లోకమంతా ఆ ఖగోళ వింతను చూడాలని ఆసక్తిగా ఉన్నా, ఐనవోలు ఆలయంలో మాత్రం ఆధ్యాత్మిక నిశ్శబ్దం అలుముకుంది.

ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్ గారు తెల్లవారుజామునే మేల్కొని, గ్రహణ సమయానికి ముందే స్వామివారికి జరగాల్సిన నిత్య కైంకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. శాస్త్రోక్తంగా గ్రహణ సమయంలో దేవాలయ తలుపులు మూసి ఉంచడం ఆనవాయితీ. నరేష్, సమయం దగ్గర పడుతోంది. స్వామివారి గర్భాలయాన్ని సిద్ధం చేయండి, అని తోటి అర్చకులు నరేష్ శర్మకు సూచించారు శ్రీనివాస్,



నరేష్ శర్మ గారు ఎంతో భక్తితో స్వామివారికి అలంకరించిన పుష్పాలను తొలగించి, గర్భాలయాన్ని శుద్ధి చేశారు. గ్రహణ కిరణాలు స్వామివారిపై పడకుండా ఉండేలా దర్భలను (కుశ) ఉంచి, మంత్రోచ్చారణల మధ్య గర్భాలయ తలుపులను మూసివేశారు.

ఆలయ సిబ్బంది అందరూ క్రమశిక్షణతో ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, భక్తులకు గ్రహణ నియమాలను వివరిస్తున్నారు. దేవుడిని సేవించడం అంటే కేవలం పూజలు చేయడమే కాదు, ప్రకృతి ధర్మాన్ని పాటించడం కూడా అని శ్రీనివాస్ గారు సిబ్బందికి ధైర్యం చెప్పారు. గ్రహణం ముగిసే వరకు అందరూ నామస్మరణ చేస్తూ వేచి చూశారు. గ్రహణం ముగియగానే, పాతర్లపాటి శ్రీనివాస్ గారు, నరేష్ శర్మ గారు పవిత్ర స్నానాలు ఆచరించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

సంప్రోక్షణ: ఆలయమంతా పుణ్యజలంతో శుద్ధి చేశారు.
అభిషేకం: మల్లికార్జున స్వామికి పంచామృతాలతో మహాభిషేకం నిర్వహించారు. తాజా పదార్థాలతో వండిన నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించారు.

మళ్ళీ ఆలయ గంటలు మ్రోగాయి. భక్తులు ఓం నమః శివాయ అనే నామస్మరణతో ఆలయానికి పోటెత్తారు. అర్చకులు మరియు సిబ్బంది సమష్టి కృషితో గ్రహణం వంటి క్లిష్ట సమయంలో కూడా ఐనవోలు మల్లన్న సేవలు విఘాతం లేకుండా సాగాయి. ప్రకృతిలో మార్పులు సంభవించినా, భక్తి మార్గంలో నడిపించే గురువులు ఉన్నంత కాలం ధర్మం వర్ధిల్లుతూనే ఉంటుంది.

